
సాక్షి
కాకినాడ
మంగళవారం । 23 । మే । 2023



సరదాల వేళ.. మృత్యు పరదా

ఆ ముగ్గురూ బంధువులే.. వీరిలో ఒకరి పెళ్లి రోజు.. అందరూ కలిసి కారులో యానాం పార్టీకి వెళ్లి తిరిగి వస్తూ మృత్యువాత పడ్డారు. - 8లో▸



స్వల్పంగా పెరిగిన ఉధృతి

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 12,389 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. గోదావరి ఉధృతి స్వల్పంగా పెరిగింది.

గరిష్టం/కనిష్టం
41.5° / 26.4°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	41.5	26.5
కాకినాడ	37.2	26.4
అమలాపురం	39.0	27.0

న్యూస్‌రీల్

జెడ్పీ మాజీ సీఈవో కోరా జయరాజు మృతి



కాకినాడ సిటీ: జిల్లా పరిషత్ మాజీ సీఈవో కోరా జయరాజు (65) గుండెపోటుతో సోమవారం ఉదయం మరణించారు. 1958లో రంపచోడవరంలో జన్మించిన జయరాజు జూనియర్ అసిస్టెంట్ హోదాలో ఉద్యోగంలో చేరారు. వివిధ హోదాల్లో సుమారు 39 ఏళ్ల పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. ఎస్‌ఈజెడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తూ రిటైరైన జయరాజు కాకినాడ ఇంద్రపాలెంలో ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జయరాజ్ మృతి గురించి తెల్లవారు జామున సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న రెవెన్యూ శాఖలోని ఉద్యోగులు, సిబ్బంది, అభిమానులు పెద్ద ఎత్తున ఇంద్రపాలెంలోని నివాసానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఇంద్రపాలెం చేరుకుని జయరాజ్ భౌతిక కాయానికి నివాళులర్పించారు.

పోలీస్ స్పందనకు 84 ఫిర్యాదులు

కాకినాడ క్రైం: కాకినాడలో జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీస్ స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 84 అర్జీలు అందాయి. జిల్లా ఎస్పి సతీష్‌కుమార్ అర్జీలు స్వీకరించి ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల్లో 39 మంది మహిళలు, 45 మంది పురుషులు ఉన్నారు.

టెన్నిస్ ప్లేయర్‌కు అరబిందో చేయూత



సుభాష్ తండ్రికి ఆర్థిక సాయం చెక్కును అందజేస్తున్న ఎంపీ వంగా గీత తదితరులు

కాకినాడ సిటీ: జిల్లాకు చెందిన టెన్నిస్ క్రీడాకారుడు పెనుపోతుల లక్ష్మీ సాయి సుభాష్‌కు అరబిందో ఫార్మ ఫౌండేషన్ రూ. 6 లక్షల ఆర్థిక సాయం అందజేసింది. కాకినాడలో సోమవారంసుభాష్ తండ్రికి ఎంపీ వంగా గీత, కాకినాడ సెజ్ ప్రాజెక్టు హెడ్ జి సీతారామయ్య ఈమేరకు సహాయం అందించారు. కొత్తపల్లి మండలం యండపల్లికి చెందిన సుభాష్ ఆంధ్రప్రదేశ్ అండర్–18 నేషనల్ టెన్నిస్ ప్లేయర్. ప్రస్తుతం ఇండియాలో 98వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. అంతర్జాతీయ స్థాయి శిక్షణకు కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించని నేపథ్యంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ స్పందించింది.ఆర్థిక సహాయం ప్రకటించి అందజేసింది. ఈ సంస్థ డైరెక్టర్లు నిత్యానందరెడ్డి, శరత్‌చంద్రరెడ్డిలకు ఈసందర్భంగా ఎంపీ వంగా గీత, సుభాష్ కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లికి చెందిన రావు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఫలితాల్లో మెరిసిన అభ్యర్థులు

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): ఏపీ సార్వత్రిక విద్యా పీఠం నిర్వహించిన ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జిల్లా అభ్యర్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. గత నెల 3 నుంచి 15వ తేదీ వరకు పది, ఇంటర్ పరీక్షలు జరిగాయి. ఎస్ఎస్‌సీ ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచింది. ఇంటర్ ఫలితాల్లో 6వ స్థానంలో నిలిచింది. పదవ తరగతి పరీక్షలకు జిల్లా నుంచి 1,983 మంది హాజరయ్యారు. వీరిలో 1,473 మంది పాసయ్యారు. ఇంటర్మీడియేట్ పరీక్షలకు 5,319 మంది హాజరు కాగా, 4,007 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లా విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించడం పట్ల జిల్లా విద్యాశాఖాధికారి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ పి.సాయివెంకటరమణ సంతోషం వెలిబుచ్చారు.

రత్నగిరిపై పెళ్లి సందడి

అన్నవరం: వరుస సెలవులకు వివాహాల సందడి తోడవ్వడంతో రత్నగిరి సత్యదేవుని ఆలయం సోమవారం కిటకిటలాడింది. నవ దంపతులు, వివాహాలకు హాజరవుతున్న పెళ్లిబృందాలతో స్వామివారి ఆలయం, ఆలయప్రాంగణం కిక్కిరిసి పోయింది. ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున రత్నగిరిపై సుమారు వంద వివాహాలు జరిగాయి. ఇతర ప్రాంతాలలో కూడా అదే ముహూర్తానికి పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరగడంతో బంధువులతో కలసి నవదంపతులు సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు. సుమారు 40 వేల మంది స్వామిని దర్శించుకున్నారు. రెండు వేల వ్రతాలు జరిగాయి. దర్శనానికి రెండు గంటలు, రూ.200 టిక్కెట్‌తో అంతరాలయ దర్శనానికి గంట సమయం పట్టింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

మృత్యు రాదారులు



యానాం వద్ద జాతీయ రహదారికి ఆనుకుని బార్ అండ్ రెస్టారెంట్లు

- నిత్యం ప్రమాదాలు
- మితిమీరిన వేగం
- అదుపు లేని డ్రైవింగ్
- తోడవుతున్న మద్యం
- వీటన్నింటి ఫలితంగా గాల్లో కలుస్తున్న ప్రాణాలు

స్పీడ్ బైక్‌లు, వేగ నియంత్రణ లేని కార్లు, లారీలు, బస్సులు.. రయ్ మంటూ దూసుకుపోయేంతగా పట్టపగ్గాలు లేని వేగం.. తోడవుతున్న మద్యం మత్తు.. కరువవుతున్న స్వీయ నియంత్రణ.. కొంతమంది పోలీసులు, రవాణా శాఖ అధికారుల ఉదాసీనత.. ఫలితంగా ఇటీవల కొన్నాళ్లుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రహదారులు నిత్యం రక్తసిక్తమవుతున్నాయి.

జిల్లాలో గత ఆరు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలు

16వ నంబర్ జాతీయ రహదారిపై..	
ప్రమాదాలు :	89
మరణాలు :	52
క్షతగాత్రులు :	75
216వ నంబర్ జాతీయ రహదారిపై..	
ప్రమాదాలు :	70
మరణాలు :	25
క్షతగాత్రులు :	86
డ్రంగ్ అండ్ డ్రైవ్ కేసులు :	954
ఈ–చలానాలు :	31,545
జరిమానాల వసూలు :	రూ.1,06,94,152

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కోల్‌కతా – చెన్నై 16వ నంబర్ జాతీయ రహదారి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని తుని నుంచి నల్లజర్ల వరకూ సాగుతోంది. దీనికి అనుసంధానంగా కత్తిపూడి – ఒంగోలు 216, దివాన్‌చెరువు – గుండుగొలను 216ఎ, రాజమహేంద్రవరం – విజయనగరం 416 తదితర జాతీయ రహదారులున్నాయి. వీటితో పాటు రాజానగరం – కాకినాడ పోర్టు ఏడీబీ రోడ్డు కూడా ఉంది. ఇవన్నీ దాదాపు నాలుగు/రెండు లేన్ల రోడ్లుగా ఉన్నాయి. ఇటీవల వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చేశాయి.. చేస్తున్నాయి. ప్రయాణం హాయిగా, కుదుపులు లేకుండా సాగడానికి వీలుగా.. నునుపుగా, విశాలంగా నిర్మించిన ఈ రోడ్లపై మితిమీరిన వేగంతో దూసుకుపోతూ పలువురు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అదుపు లేని వేగం ప్రాణాలు బలి కోరుతుందని, ప్రమాదకరమని తెలిసినా కొంతమంది థ్రిల్ కోసం.. మరికొంతమంది మద్యం మత్తులో పడి రోడ్డు ప్రమాదాలకు గురై, ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో అత్యధికంగా 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు వారే ఉండటం గమనార్హం. ఈ రోడ్లపై ఇటీవల నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజలు ప్రాణాలు గాలిలో కలిసిపోతూనే ఉన్నాయి.

ప్రమాదాల పరంపర

కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలను కలిపే 216 జాతీయ రహదారి ఇటీవల తరచుగా రక్తమోడుతోంది. వాహనచోదకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ రహదారిపై తాళ్లరేవు వద్ద ఇటీవల ఆటోను, ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘోర ప్రమాదం ఎనిమిది మంది మహిళలను బలి తీసుకుంది. వారి పిల్లలు తల్లులకు దూరమయ్యారు. ఈ సంఘటన జరిగి పట్టుమని 10 రోజులు కూడా కాకుండానే ఆదివారం అర్ధరాత్రి దాటాక అదే రోడ్డుపై ముమ్మిడివరం నగర పంచాయతీ బొండాయికోడు వద్ద జరిగిన మరో ప్రమాదంలో ముగ్గురు సమీప బంధువులు దుర్మరణం పాలయ్యారు. యానాం నుంచి అమలాపురం కారులో వెళ్తున్న వారిని ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదం మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ రెండు సంఘటనల్లోనూ మితిమీరిన వేగం, మద్యం మత్తులో వేగాన్ని నియంత్రించ లేకపోవడమే ప్రధాన కారణమని పోలీసు ఉన్నతాధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ దుర్ఘటనలకు రెండు నెలల ముందు యానాం నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు ఇంజినీరింగ్ విద్యార్థుల బృందం వెళ్తున్న కారు కూడా ఇదే జాతీయ రహదారిపై కొమానపల్లి వద్ద పల్టీలు కొట్టింది. ఒక విద్యార్థిని మృతి చెందగా ముగ్గురు ప్రాణాలతో బయట పడ్డారు. అంతకుముందు మరో ఘటనలో గృహప్రవేశానికి పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తున్న భార్యాభర్తలు చిన్నారులతో సహా మృత్యువాత పడ్డారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా తాళ్లరేవు ఆటో ప్రమాదం తర్వాత అధికార యంత్రాంగం కళ్లు తెరిచింది. పలు ప్రాంతాల్లో వేగ నిరోధక చర్యలకు ఉపక్రమించింది. సీతారామపురం సుబ్బారాయుడు దిమ్మ, సీతారామపురం పెట్రోలు బంకు (గాడిమొగ జంక్షన్), తాళ్లరేవు కేశవస్వామి బైపాస్ జంక్షన్, గురజనాపల్లి జంక్షన్లలో వేగ నియంత్రణకు టైర్లు, డ్రమ్ములతో డివైడర్లు ఏర్పాటు చేశారు.



గత వారం తాళ్లరేవు వద్ద జరిగిన ఆటో ప్రమాదం

యానాం మద్యం కోసం..

216 జాతీయ రహదారికి ఇరువైపులా పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతమైన యానాంలో పెద్ద సంఖ్యలో మద్యం దుకాణాలున్నాయి. అక్కడ సరసమైన ధరలకు మద్యం అందుబాటులో ఉంటోంది. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న మద్యపాన ప్రియులు ఇక్కడ మద్యం తాగి, అదే మత్తులో వాహనాలు నడుపుతూ, ప్రమాదాలకు కారణమవుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని మద్యం దుకాణాలు ఉండరాదంటూ సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. వీటిని మద్యం వ్యాపారులు బేఖాతరు చేస్తూ ప్రమాదాలకు పరోక్షంగా కారణమవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సంబంధిత అధికారులు కూడా దీనిని పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రమాదాలకు మద్యం మత్తులో మితిమీరిన వేగంతో వాహనాలు నడపడానికి తోడు జాతీయ రహదారికి సమాంతరంగా సర్వీసు రోడ్లు ఉన్న ప్రాంతాల్లో సరైన సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవం మరో కారణం.



కోరింగ పోలీస్ స్టేషన్ పరిధిలో 216 జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లు

బ్లాక్‌స్పాట్లు

- 16వ నంబర్ జాతీయ రహదారిపై తూర్పు గోదావరి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ప్రమాదకర కేంద్రాలు (బ్లాక్‌స్పాట్లు) ఉన్నాయి. పొట్టిలంక సెంటర్, కడియపులంక, బుర్రిలంక, వేమగిరి, ఇండస్ట్రియల్ కాలనీ, హార్లిక్స్ ఫ్యాక్టరీ, మోరంపూడి జంక్షన్, లాలాచెరువు, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, కలవచర్ల జంక్షన్, గామన్ బ్రిడ్జి, ఖండవల్లి సెంటర్, అన్నవరప్పాడు సెంటర్, గోపాలపురం చెక్‌పోస్టు, కొవ్వూరు, నల్లజర్ల రోడ్ ఓవర్ బ్రిడ్జి వీటిల్లో ఉన్నాయి.
- 216 జాతీయ రహదారిపై కాకినాడ జిల్లా తాళ్లరేవు, కోరంగితో పాటు, యానాం – ఎదుర్లంక వంతెన, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొమరగిరి డేంజర్ టర్నింగ్, కొమానాపల్లి, బొండాయికోడు – మహిపాల చెరువు, భట్నవిల్లి బ్లాక్‌స్పాట్లుగా ఉన్నాయి.

ప్రమాదం జరిగితేనే హడావుడి

ఏదైనా పెద్ద ప్రమాదం జరిగినప్పుడు పోలీసు, రవాణా శాఖలు ఒకటి, రెండు రోజులు హడావుడి చేస్తున్నాయి. ప్రజలు కూడా ఆ రెండు రోజులే కాస్త నెమ్మదిస్తున్నారు. తరువాత షరా మామూలే. అధికారులు డ్రంక్ అండ్ డ్రైవ్ మొక్కుబడిగా నిర్వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. అలాగే, మితిమీరిన వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేయలేదు. మరోపక్క ఫిట్‌నెస్ లేని ఆటోలను, ద్విచక్ర వాహనాలను నియంత్రించడంలో పోలీసులు ఉదాసీనంగా ఉంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

బ్లాక్‌స్పాట్లలో పటిష్ట చర్యలు



జాతీయ రహదారులపై జరుగుతు న్న ప్రమాదాలపై హైవే అథారిటీ అధికారులతో మరోసారి చర్చిస్తు న్నాం. బ్లాక్‌స్పాట్లలో బారికేడ్లు ఏ ర్పాటు చేస్తాం. స్పీడ్ బ్రేకర్లు నిర్మి స్తాం. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల ద్వా రా యువతకు మరింత అవగాహన కల్పిస్తాం. జాతీయ రహదారులపై రాత్రి సమయాల్లో పోలీసు పెట్రోలింగ్ పెంచుతాం.

– సతీష్ కుమార్, ఎస్పీ, కాకినాడ జిల్లా

జిల్లా స్పందనకు 330 అర్జీలు



స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ వంగా గీత

కాకినాడ సిటీ: స్పందనలో అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, ఇన్‌ఛార్జి డీఆర్వో కె శ్రీరమణి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మిలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఎంపీ వంగా గీత హాజరై పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌరసరఫరాల సేవలు, నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 330 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతకు చర్యలు : కలెక్టర్ కృతికా శుక్లా

కలెక్టరేట్ వద్ద ఉఈవీఎం, వీవీప్యాట్ గోదామును సోమవారం కలెక్టర్ కృతికా శుక్లా రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపకశాఖల అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఈవీఎం భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ప్రతి నెల ఈవీఎం, వీవీప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్డీవో బీవీ రమణ, కాకినాడ పట్టణ తహసీల్దార్ సీతాపతి రావు, కాకినాడ పట్టణ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సిహెచ్ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు భారీగా వైఎస్సార్ సీపీలో చేరిక

స్వాగతం పలికిన ఎమ్మెల్యే కన్నబాబు



ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన, టీడీపీ కార్యకర్తలు

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి పగడాలపేటకు చెందిన మత్స్యకారులు జనసేన, తెలుగుదేశం పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో సోమవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో భారీగా చేరారు. తూరంగి మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలను ఎమ్మెల్యే కన్నబాబు వేసి సాదరంగా ఆహ్వానించారు. కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ బలమైన శక్తిగా ఉందని ప్రజా మద్దతు రోజు రోజుకు పెరుగుతుందనేందుకు జనసేన, టీడీపీ నుంచి చేరికలే నిదర్శనమన్నారు. పార్టీ అధ్యక్షుడు, సీఎం జగన్ చెప్పిన విధంగా 175 ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకుంటామన్నారు. తూరంగి నుంచి పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ తూరంగిలో సంక్షేమ పథకాలు వర్తింపజేయడంతో పాటు అభివృద్ధి పనులు చేయడంతో జనసేన, టీడీపీ నుంచి సుమారు 100మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారన్నారు. పార్టీలో చేరిన వారిలో మోసా నూకరాజు, శేషు, కొండ, ఉప్పరపల్లి రాజు తదితరులు ఉన్నారు.

లోవకు హుండీల రూ.30 లక్షలు ఆదాయం

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన మొక్కుబడుల ఆదాయం రూ.30,17,144 లభించినట్టు లోవదేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. సోమవారం దేవదాయ ధర్మాదాయశాఖ పెద్దాపురం తనిఖీదారు సిహెచ్.ఉదయబాబు నాయుడు పర్యవేక్షణలో హుండీలను తెరిచారు. నగదు లెక్కించారు. నాణేలు రూ.1,05,007, నగదు రూ.29,12,137 వెరసి రూ.30,17,144 ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు. 51 రోజులకు ఈ మొత్తం లభించిందన్నారు. చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ధర్మకర్తలు, శ్రీవారి సేవకులు నగదు లెక్కింపులో పాల్గొన్నారు.

సిరివాడలో ఎమ్మెల్యే రాజప్పకు అసమ్మతి సెగ

ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణకు తెలుగుతమ్ముళ్లు దూరం

పెద్దాపురం: మండలంలోని సిరివాడలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు అసమ్మతి సెగ తగలింది. ఎన్‌టిఆర్ శత జయంతి దినోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణ సభ వెలవెలబోయింది. ఎమ్మెల్యేపై ఉన్న అసంతృప్తితో టీడీపీ సీనియర్ నాయకుడు, ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కమ్మిల సుబ్బారావు వర్గం కార్యక్రమానికి హాజరుకాలేదు. దీంతో సభ వెలవెలబోయింది. పార్టీ మండల స్థాయి నాయకులు కొత్తెం కోటి, ఎలిశెట్టి నానిల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నుంచి పార్టీ తెలుగుతమ్ముళ్లను తీసుకువస్తేనే గాని సభాస్థలి నిండని పరిస్థితి ఎదురైంది. ఈ పరిస్థితితో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్‌లు అవాక్కయ్యారు. సుపరిచితుడైన పార్టీ సీనియర్ నాయకులు కమ్మిల సుబ్బారావు గైర్హాజరుపై ఎమ్మెల్యేను ఆరా తీశారు. సభాస్థలి వద్దకు సుబ్బారావు రాకుండానే సుబ్బారావు స్టేజ్‌పైకి రావాలంటూ పిలిచారు. ఆ వర్గీయులు ఎక్కడా కనబడకపోవడంతో తెలుగు తమ్ముళ్ల చెవులు కొరుక్కున్నారు. దీనిపై సాక్షితో సుబ్బారావు మాట్లాడుతూ పార్టీకంటే ఎమ్మెల్యే చేస్తున్న వర్గబేధం తనను బాధించిందన్నారు. త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుని రాజప్ప పార్టీకి చేస్తున్న నష్టంపై మీడియా ముందుకు వస్తానన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం

కాకినాడ సిటీ: జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ వసతి గృహాల్లో చదువుతూ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 500పైబడి మార్కులు సాధించిన 16 మంది విద్యార్థులను సోమవారం కలెక్టరేట్‌లో ఎంపీ వంగా గీత, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ చేతుల మీదుగా జ్ఞాపిక,డిక్షనరీ, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో మరింత ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని వీరు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, కాకినాడ, తుని, పెద్దాపురం డివిజన్ల సహాయ బీసీ సంక్షేమాధికారులు టీవీబీ ప్రసాద్, ఎస్ రాజేశ్వరి, వసతి గృహాల సంక్షేమ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్‌కు వేళాయె...

- స్కూల్ బస్సుల సామర్థ్యంపై ఫోకస్
- ఆర్టీఏ అధికారులు తనిఖీలు ప్రారంభం
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పాఠశాలలు తెరిచే సమయం దగ్గర పడుతోంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వపరంగా ఏర్పాట్లు మొదలయ్యాయి. ప్రైవేట్ విద్యా సంస్థలు ఇందుకోసం సమాయత్తం అవుతున్నాయి. అడ్మిషన్లు..ఫ్యాకల్టీ నియామకం..పుస్తకాలు..పిల్లలను తరలించే బస్సుల నిర్వహణ లాంటి పనులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా పిల్లల బస్సులపై ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు చాలా శ్రద్ధ పెట్టాల్సిన అవసరముంది. కాలం చెల్లిన బస్సులు నడిపితే విద్యార్థులకు ఎంతో ఇబ్బందికరం..ఒక్కోసారి చాలా ప్రమాదాలకు దారి తీస్తుంది. అందుకే బస్సుల సామర్థ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. విద్యా సంస్థలకు చెందిన బస్సులకు ఏటా సామర్థ్య పత్రం (ఎఫ్‌సీ) జారీ చేస్తుంది.

స్కూల్స్,కళాశాలలు తెరిచే నాటికి వాహనాల సామర్థ్యం బాగుండాలి. ఈమేరకు రవాణాశాఖ అధికారులు ఇప్పటికే ఆదేశాలు కూడా జారీ చేశారు. సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు ఈ సర్టిఫికెట్లకు సిద్ధమవుతున్నాయి. జిల్లా పరిధిలో కాకినాడ, పెద్దాపురం, కత్తిపూడి ప్రాంతాలలో ఆయా కార్యాలయాలను అనుసంధాన మండలాల్లోని వాహనాలను తనిఖీచేస్తున్నారు. అనంతరం ఎఫ్‌సీలు జారీచేయనున్నారు.

జిల్లాలో 1203 వాహనాలు..

రూల్ నెంబర్ 185(ఎఫ్) ప్రకారం ప్రతి స్కూల్,కళాశాలల బస్సులు కచ్చితంగా రవాణాశాఖ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఈ నెలంతా రవాణాశాఖ అధికారులు బస్సులను పరీక్షించి ఎఫ్‌సీలు జారీచేసే పనిలో తలమునకలయ్యారు. ప్రత్యేక సిబ్బందిని నియమించి మరీ అణువణువు తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1203 స్కూల్ బస్సులు ఉన్నాయి. ఏటా ఇదే నెల 15వ తేదీకి వ్యాలిడిటీ అయిపోతుంది. బస్సులో అన్నీ బాగుంటే తరువాత తేది నుంచి మరో ఏడాదికి పాటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తారు.

నిబంధనలు ఇలా...

- స్కూలు బస్ డ్రైవర్‌కు 60 సంవత్సరాలు దాటి ఉండరాదు
- బీపీ,షుగర్,కంటి సంబంధిత సమస్యలు లేవని సర్టిఫికెట్ వైద్యుని ద్వారా సమర్పించాలి.
- బస్సులోనూ, యాజమాని దగ్గర డ్రైవరు ఆరోగ్య సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉంచాలి.
- డ్రైవర్ నియామకాన్ని ఆర్టీఓ అధికారులకు ముందుగా తెలియజేయాలి.
- డ్రైవరుకు ఐదు సంవత్సరాల అనుభవం ,హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- విద్యా సంస్థ ప్రిన్సిపాల్ ..విద్యార్థుల తల్లిదండ్రులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలి. ప్రతి నెలా వాహనానికి సంబంధిత స్థితిగతులు రిజిస్టర్ చేయాలి.
- అన్ని లైట్లు,సిగ్నల్స్ కచ్చితంగా పనిచేయాలి. బస్సుకు నాలుగు వైపులా రిఫ్లెక్టివ్ టేపును అతికించాలి.
- గ్లాసులన్నీ పటిష్టంగా ఉండాలి. పొగ అధికంగా రాకూడదు. బ్రేకులు కండిషన్‌లో ఉండి పెయింటింగ్ కొత్తగా వేయించాలి.
- ఎమర్జెన్సీ డోర్, అగ్గిని ఆర్పే పరికరం,ఫస్ట్ ఎయిడ్ పరికరం తప్పని సరిగా ఉండాలి.



స్కూల్ బస్సుల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్న రవాణాశాఖాధికారి (ఫైల్)

ఫిట్‌నెస్ ఉంటేనే రోడ్డెక్కాలి



స్కూల్ బస్సులకు ఎఫ్‌సీల జారీపై విద్యాసంస్థలకు సమాచారం ఇచ్చాం. అన్ని సక్రమంగా ఉంటే సర్టిఫికెట్ జారీ చేస్తున్నాం. పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో తప్పనిసరిగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలి. ఎటువంటి నిబంధనలు పాటించక పోయినా బస్సులు సీజ్ చేస్తాం. కేసులు నమోదు చేస్తాము. స్కూల్స్ యాజమాన్యాలు ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదు.

– ఎ.మోహన్, డీటీవో. కాకినాడ

వృద్ధుడిపై హత్యాయత్నం

పెద్దాపురం: పాత కక్షల నేపథ్యంలో ఓ వృద్ధుడిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు ఓ దుండగుడు. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దాపురం మండలం పులిమేరు గ్రామానికి చెందిన విజ్జపురెడ్డి విష్ణుకు, అతడి తమ్ముడు పెద్దలుకు మధ్య కొన్నాళ్లుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. తన తమ్ముడికి గ్రామానికి చెందిన గవరసాని వెంకట్రావు (65) మద్దతుగా ఉంటున్నాడని అతడిపై విష్ణు కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో చలదాడ రోడ్డులోని పొలంలో ఉన్న మొక్కలకు వెంకట్రావు సోమవారం నీరు పోస్తున్నాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేరు. ఇదే అదునుగా అతడిపై విష్ణు ఒక్కసారిగా కత్తితో దాడి చేసి, రెండు భుజాలు నరికాడు. గాయపడిన వెంకట్రావును స్థానికులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సరదాల వేళ.. మృత్యు పరదా

- ప్రాణాలు కబళించిన పెళ్లి రోజు పార్టీ
- యానాం వెళ్లి వస్తుండగా ఎదురొచ్చిన మృత్యువు
- ముమ్మిడివరం ప్రమాద మృతులు ముగ్గురూ బంధువులే
- అందరివీ రెక్కాడితేనే కానీ డొక్కాడని కుటుంబాలే
- తీరని విషాదంలో బాధిత కుటుంబాలు





దొంగ నాగ వెంకటస్వామి, గంజా కృష్ణ, యనమదల సురేష్ కుమార్ మృతదేహాలు



అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అల్లు అనిల్

అమలాపురం టౌన్: ఆ ముగ్గురూ బంధువులే.. వారితో పాటు ఓ స్నేహితుడు.. అందరివీ రెక్కాడితేనే కానీ డొక్కాడని కుటుంబాలే.. వీరిలో ఒకరి పెళ్లి రోజు కావడంతో అందరూ కలిసి కారులో యానాం వెళ్లారు. సరదాగా పార్టీ చేసుకున్నారు. ఆనందంగా గడిపారు. తిరిగి అర్ధరాత్రి స్వస్థలానికి బయలుదేరారు. మార్గం మధ్యలో వారికి టిప్పర్ రూపంలో మృత్యువు ఎదురొచ్చింది. ముగ్గురి ప్రాణాలను తీసుకువెళ్లిపోయింది. మరొకరిని క్షతగాత్రుడిగా మిగిల్చి, ఆసుపత్రి పాలు చేసింది.

ముమ్మిడివరం సమీపంలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల వద్ద 216 జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురూ అమలాపురం పట్టణం, రూరల్ ప్రాంతాలకు చెందిన వారే. వీరిలో దొంగ నాగ వెంకటస్వామి (30), గంజా కృష్ణ (38) స్వయంగా బావా బావమరుదులు. మరో మృతుడు యనమదల రమేష్ కుమార్ (33) కూడా వీరికి దగ్గరి బంధువే. వీరిలో వెంకటస్వామి ఆర్క్ వెల్డర్‌గా పని చేస్తూ అమలాపురం నారాయణపేటలోను, కృష్ణ తాపీ మేస్త్రిగా స్థానిక హైస్కూలు సెంటరు సమీపంలోను నివసిస్తున్నారు. రమేష్ కుమార్ ఆటో డ్రైవర్. అతడి కుటుంబం అమలాపురం రూరల్ మండలం రంగాపురంలో జీవిస్తోంది.

పెళ్లి రోజున అమ్మవారి ఆలయానికి వెళ్లి..

వెంకటస్వామి, గీతాలక్ష్మి దంపతులు తమ పెళ్లి రోజును ఆదివారం ఉదయం ఇంటి వద్ద వేడుకగా నిర్వహించుకున్నారు. అనంతరం తమ ఐదేళ్లలోపు పిల్లలు శరణ్య, సుశాంత్‌తో కలిసి కొత్తపేట మండలం వానపల్లి పళ్లాలమ్మ ఆలయానికి వెళ్లారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చిరకాలం ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలని అమ్మవారిని మనసారా వేడుకున్నారు.



మృతుడు నాగ వెంకటస్వామి ఇంటి వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పార్టీకి యానాం వెళ్లి వస్తూ..

అయితే విధి నిర్దయం వేరేలా ఉన్నట్టుంది. పెళ్లి రోజు పార్టీ చేసుకునేందుకని వెంకటస్వామి కారులో అతడు, బావ కృష్ణ, వారి బంధువు రమేష్‌కుమార్, స్నేహితుడు అల్లు అనిల్ కలిసి సాయంత్రం యానాం వెళ్లారు. అక్కడ ఆనందంగా పార్టీ చేసుకున్నారు. అనంతరం అర్ధరాత్రి యానాం నుంచి అమలాపురం బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న కారును శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఎదురుగా వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటస్వామి, కృష్ణ, రమేష్‌కుమార్ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన అనిల్ ఆందోళనకర పరిస్థితుల్లో అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



అమలాపురంలో తాపీమేస్త్రి కృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

సహాయక చర్యల్లో జక్కంపూడి కిరణ్

ఈ ప్రమాదం జరిగిన కొద్ది క్షణాల తర్వాత అదే రోడ్డులో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ కాకినాడ నుంచి కారులో అమలాపురం వస్తున్నారు. ప్రమాదాన్ని గమనించిన వెంటనే ఆయన స్పందించారు. చావు బతుకుల మధ్య కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న యువకులను వెంటనే కారులో నుంచి బయటకు తీసి, కాపాడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కిరణ్ నుదిటిపై స్వల్ప గాయం కూడా అయ్యింది. అయినప్పటికీ ఆయన 108కు సమాచారం అందించి, ప్రమాదానికి గురైన వారిని ఆసుపత్రులకు తరలించే ఏర్పాట్లు చేశారు. ముగ్గురి మృతదేహాలూ అమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకోవడంతో.. వారి కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో అక్కడ విషాదం అలముకుంది.

రెక్కలు తెగిన కుటుంబాలు

తమ పెళ్లి రోజునే జరిగిన ఈ ప్రమాదంలో భర్త వెంకటస్వామి దుర్మరణం పాలవడంతో అతడి భార్య గీతాలక్ష్మితో పాటు కుటుంబ సభ్యులు బంధువులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. మరో మృతుడు గంజా కృష్ణకు భార్య సూర్యాదేవి, పిల్లలు 13 ఏళ్ల రవిచంద్ర, 11 ఏళ్ల విక్రమ్ ఉన్నారు. రమేష్ కుమార్‌కు భార్య సుజాత, పిల్లలు 14 ఏళ్ల చరణ్‌కుమార్, ఎనిమిదేళ్ల సత్య కార్తికేయ ఉన్నారు. మృతి చెందిన ముగ్గురూ దాదాపు యువకులే. వారి సంతానం కూడా ఇంకా చిన్న పిల్లలే. తమ బతుకులకు ఆధారంగా ఉన్న ఇంటి యజమానులు మృత్యువాత పడటంతో ఆ కుటుంబాలు ఒక్కసారిగా రెక్కలు తెగిన పక్షుల్లా దిక్కు లేనివిగా మారాయి.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

సాక్షి, అమలాపురం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 38 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. తూర్పు గోదావరిలో 31, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో 7 చొప్పున కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు మార్క్‌ఫెడ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేంద్రాల్లో క్వింటాల్ మొక్కజొన్నను రూ.1,962 చొప్పున కొనుగోలు చేస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గోదావరి లంక భూముల్లో మొక్కజొన్న సాగు చేస్తారు. కోనసీమలో అయినవిల్లి, ముమ్మిడివరం, పి.గన్నవరం, మామిడికుదురు, ఆలమూరు, కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాలు; తూర్పు గోదావరి జిల్లాలోని సీతానగరం, కొవ్వూరు లంకలతో పాటు మెట్ట ప్రాంతంలో రెండో పంటగా మొక్కజొన్న సాగు జరుగుతోంది. ఆయా ప్రాంతాల రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది.

'మా భర్తలను సొంత జిల్లాలకు బదిలీ చేయండి'

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రంపచోడవరం, చింతూరు సబ్ డివిజన్లలో పని చేస్తున్న తమ భర్తలను జీఓ నంబర్-71 ప్రకారం సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరుతూ పలువురు పోలీసు సిబ్బంది భార్యలు, కుటుంబ సభ్యులు కలెక్టర్ కృతికా శుక్లాకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడారు. 2022లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తమ భర్తలు (పోలీసులు) పని చేసేవారన్నారు. వారిని జిల్లాల పునర్విభజన అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం, చింతూరు సబ్ డివిజన్లకు బదిలీ చేశారని తెలిపారు. తిరిగి వారిని కాకినాడ జిల్లాకు బదిలీ చేయాల్సిందిగా కోరామని, ఇప్పటికీ ఏజెన్సీలోనే పని చేయిస్తున్నారని చెప్పారు. దీనివలన తాము ఒకచోట, తమ భర్తలు మరోచోట ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన ఆర్థికంగా, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వృద్ధులైన తల్లిదండ్రులను చూసుకునే పరిస్థితి లేక తమ భర్తలు వేదనకు గురవుతున్నారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండేళ్ల నుంచి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారిని సొంత జిల్లా అయిన కాకినాడ లేదా మైదాన ప్రాంతానికి బదిలీ చేయాల్సిందిగా కలెక్టర్‌కు, ఎంపీ వంగా గీతకు విజ్ఞప్తి చేశామన్నారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన వారిలో 60 మందికి పైగా మహిళలున్నారు.



తమ భర్తలకు ఏజెన్సీ నుంచి బదిలీ చేయాలని కోరుతున్న పోలీసు సిబ్బంది భార్యలు

వేంకటేశ్వరస్వామికి వెండి కవచం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జగన్నాథపురంలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి వారికి నగరానికి చెందిన భక్తుడు గోవిందరావు రూ.30 లక్షలతో తయారు చేయించిన వెండి వజ్ర కవచం సమర్పించారు. దీనికి అర్చకులు సోమవారం సంప్రోక్షణ చేసి, స్వామి వారికి అలంకరించారు. దాతను ఆలయ ఈఓ తారకేశ్వరరావు సత్కరించారు.



సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు



కొవ్వూరులో బహిరంగ సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

- పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం కొవ్వూరులో జగనన్న విద్యా దీవెన కార్యక్రమానికి రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. సభా ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆమె సోమవారం రాత్రి పరిశీలించారు. హెలిప్యాడ్ నుంచి 2.1 కిలోమీటర్ల పొడవునా సభా ప్రాంగణం వరకూ నిర్వహించే సీఎం రోడ్‌షోకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. రూట్ మ్యాప్‌లో భద్రతా చర్యలపై ఎస్పీతో చర్చించారు. అనంతరం సభా ప్రాంగణంలో గ్యాలరీలను పరిశీలించారు. సభా ప్రాంగణంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతితో పాటు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా, ఆర్డీఓలు ఎస్.మల్లిబాబు, చైత్రవర్షిణి, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఈఎస్‌బీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో ట్రాఫిక్ మళ్లింపు

- సీఎం పర్యటన నేపథ్యంలో బుధవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ కొవ్వూరు పట్టణంలో ట్రాఫిక్ మళ్లించనున్నట్టు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ తెలిపారు.
- పట్టణంలోకి లారీలు, ఇతర సరకు వాహనాలకు అనుమతి లేదు.
- ఏలూరు, హైదరాబాద్ వైపు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే వాహనాలను, ఆర్టీసీ బస్సులను గామన్ ఇండియా బ్రిడ్జి మీదుగా మళ్లిస్తారు.
- రాజమహేంద్రవరం నుంచి వచ్చే వాహనాలు రోడ్డు-కం-రైలు వంతెన, కొవ్వూరు వాటర్ ట్యాంకు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- బస్సులతో సహా ఏ వాహనాన్నీ పట్టణంలోకి అనుమతించరు.
- కొవ్వూరు వచ్చే బస్సు ప్రయాణికులను ఏసీఆర్ లాడ్జి జంక్షన్ దాటాక పెట్రోలు బంక్ వద్ద దింపాలి.
- నిడదవోలు, తాడేపల్లిగూడెం వైపు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ఆర్టీసీ బస్సులను గామన్ బ్రిడ్జి మీదుగా నడపాలి.
- రాజమహేంద్రవరం నుంచి నిడదవోలు, తాడేపల్లిగూడెం వెళ్లే వాహనాలను ధవళేశ్వరం ఆనకట్ట మీదుగా మళ్లించనున్నారు.
- ఉదయం 11 నుంచి రోడ్డు కం రైలు వంతెన మీద, ధవళేశ్వరం ఆనకట్ట మీద వన్‌వే ట్రాఫిక్ అమలు చేస్తారు.